ఆంధ్రజ్యోతి



5 జయశంకర్ భూపాలపల్లి ములుగు

శుక్రవారం 13 సెప్టెంబరు 2024

మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవులు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులపాటు సెలువులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మార్కెట్ యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం వినాయక నిమజ్జనం సెలవు, మంగళవారం ఈద్ మిలాద్ నబీ పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

నిమజ్జన ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



నిమజ్జన పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ

మహదేవపూర్, సెప్టెంబరు 12 : వినాయక నిమజ్జన ఏర్పాట్లను పటిష్ఠంగా చేపట్టాలని అధికారులను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మండలంలో ఆయన ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి గురువారం పర్యటించారు. కాళేశ్వరంలోని రాజరాజేశ్వర స్వామి వసతి గృహంలో ఇరిగేషన్, పోలీస్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ నేషనల్ హైవే తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జనం జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కాళేశ్వరానికి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచే కాకుండా వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున గణపతులను నిమజ్జనం చేసేందుకు తరలి వస్తారని తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో గోదావరిలో నిమజ్జనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి రెండు భారీ క్రెయిన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రేయిన్ల ద్వారానే విగ్రహాల నిమజ్జనం చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ నిమజ్జనం జరిగేటప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నుంచి కాళేశ్వరం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు.

ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాళేశ్వరంలోని నిమజ్జన ప్రదేశాన్ని కలెక్టర్ సందర్శించారు.

ఆటల్లేవ్..

- పాఠశాలల్లో కనుమరుగువుతున్న గేమ్స్
- పీఈటీలు లేక వెనుకబడుతున్న విద్యార్థులు
- కొనసాగని ప్రత్యేక పీరియడ్
- పురుద్ధరిస్తామని అంటున్న సర్కారు
- పకడ్బందీగా అమలు చేయాలంటున్న క్రీడాకారులు



ఇప్పుడు స్కూల్స్‌లో కానరాని ఇలాంటి ఆటలు



భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 12: పిల్లలు శారీరకంగా ఎదిగేందుకు, మానసికంగా దృఢం కావడానికి ఆటలు ఎంతో దోహదపడతాయి. తద్వారా ప్రశాంతత కలుగుతుంది. మేధాశక్తి పెరిగి కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వైపు వారు పయనిస్తారు. అందుకే.. పాఠశాలల్లో క్రీడల నిర్వహణ అనాదిగా కొనసాగుతోంది. విద్యార్థులను చదువుతోపాటు ఆటల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. అయితే... ఇవన్నీ చాలా చోట్ల కానరావడం లేదు. బడుల్లో క్రీడలు క్రమేణా కనుమరుగవుతోంది. అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొక్కుబడిగానే కొనసాగుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో మాత్రమే పీఈటీలు ఉన్నప్పటికీ వాటిలో ఆటల పీరియడ్ ఉండటం లేదు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మొత్తం 115 ఉన్నాయి. వీటిలో 3,600 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ 115 పాఠశాలల్లో మోడల్‌స్కూల్స్, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మహాత్మా జ్యోతిబాపూలే వసతిగృహాలు కలుపుకొని 61 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,300 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ మొత్తం పాఠశాలల్లో 35 మంది పీఈటీలు మాత్రమే పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయినప్పటికీ ఆయా పాఠశాలల్లో ఆటల పీరియడ్ కొనసాగడం లేదని తెలుస్తోంది. గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా తప్ప ఇక్కడ క్రీడలు నిర్వహించడం లేదని విద్యార్థులు అంటున్నారు. దీంతో ఆటల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులకు నిరుత్సాహమే మిగులుతోంది. ఇదిలా ఉండగా విద్యార్థులు ఉన్నచోట పీఈటీలు లేరని, పీఈటీలు ఉన్నచోట ఆటస్థలం లేదని తెలుస్తోంది.

తూతూమంత్రంగా...

జిల్లాలో, రాష్ట్రంలో గానీ సంవత్సరానికోసారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడలు జరుగుతాయి. అదే సందర్భంగా తప్ప రెగ్యులర్ క్రీడలు జరగడం లేదనే విమర్శలున్నాయి. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక పీరియడ్ ఉండాల్సి ఉండగా దానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదనే తెలుస్తోంది. పైగా జనవరి 26, ఆగస్టు 15 వస్తేనే పిల్లలకు క్రీడలు నిర్వహించి బహుమతులు ఇస్తారు గానీ దేశకీర్తిని చాటిచెప్పేందుకు క్రీడాకారులను తయారు చేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు.. క్రీడల కోసం నిధులు కూడా ప్రభుత్వాలు అంతంత మాత్రంగానే వెచ్చిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా?

క్రీడారంగాభివృద్ధిపై దృష్టిసారిస్తామని, ప్రత్యేక నిధులు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. అయితే.. దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని క్రీడాకా రులు, క్రీడాభిమానులు కోరుతున్నారు. ప్రభుత్వం తన హామీకి కట్టుబడి ఉంటే ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో క్రీడల పీరియడ్‌ను పునరుద్ధరించి, విద్యార్థులను ప్రోత్సహిస్తేనే ఇది సాధ్యమవుతుందని అంటున్నారు.



మహిళా సంఘ సభ్యులకు రుణ చెక్కును అందజేస్తున్న మంత్రి సీతక్క

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 12: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. 17రకాల వ్యాపారాలను ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి ములుగు మండలంలో మంత్రి సీతక్క గురువారం పర్యటించారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా మల్లంపల్లిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో స్టూడియో, మిల్క్ పార్లర్, ఎంబ్రాయిడరీ షాపు, కిరాణా దుకాణాలను ప్రారంభించారు. రాంసింగ్ తండా వద్ద రూ.కోటి 10లక్షలు, శివతండా వద్ద రూ.కోటి 20లక్షలతో నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభించారు. జాకారంలో రూ.28.25 లక్షలతో నిర్మించిన 2 వేల లీటర్ల సేకరణ సామర్థ్యం కలిగిన పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.6 కోట్ల వ్యయంతో ములుగు ఏరియా వైద్యశాల కూడలి నుంచి జీవంత రావుపల్లి క్రాస్ వరకు నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారి, రూ.70 లక్షలతో చేపట్టిన పులిగుండం-చింత కుంట రోడ్డు, రూ.30 కోట్లతో చేపట్టిన జంగాలపల్లి-సర్వాపురం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 20ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి మహిళలకు అప్పగిస్తామన్నారు. మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ ఏడాదే జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, ప్రభుత్వ వైద్యకళాశాలతో తరగతులు ప్రారంభమవుతాయని, కొత్తగా నర్సింగ్ కళాశాల మంజూరైందని వెల్లడించారు. ములుగు, మంగపేటలో మోడల్ బస్టాండ్లను నిర్మిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలను మెరుగుపర్చడంలో భాగంగా కనెక్టివిటీ రోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రపంచ వారసత్వ సంపద రామప్పను కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ములుగు జిల్లా రాబోయే రోజుల్లో పర్యాటక, ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షలలోపు రుణమాఫీ జరుగుతుందన్నారు. కొందరు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు మాఫీ జరగనట్లు గుర్తించామన్నారు. వాటిని సరిచేసి రూ.40కోట్ల వరకు ఖాతాల్లో జమచేశామని తెలిపారు. మిగతా వారందరికీ మాఫీ జరుగుతుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ట్రైబల్‌వెల్ఫేర్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ ఈఈలు, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ

భూపాలపల్లిలో దిష్టిబొమ్మ దహనం



భూపాలపల్లిలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 12: సిక్కులపై పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతులు నిశీధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగేలా సిక్కులపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఖండనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి భట్టు రవి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, జిల్లా బీజేపీ నేతలు ప్రసాద్‌రావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలి

సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 12: వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి రూ.15వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లు, చెరువులు, ఇళ్లు నష్టపోయారని అన్నారు. దీనిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించి రూ.15 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు కేటాయించాలని, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, నాయకులు ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, జక్కుల ఐలయ్య, మామిడి నటరాజ్, మొలుగూరి రాంబాబు, కొక్కుల రాజేందర్, భిక్షపతి, రఘుపతి, నరేష్, రాజు, రవి, ప్రశాంత్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

మారేడుగొండ చెరువుకు నిధులు

రూ.3 కోట్ల 66 లక్షల 80 వేలు మంజూరు



వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 12: మండలంలోని బూర్గుపేట గ్రామ సమీపంలోని మారేడుగొండ చెరువు మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3కోట్ల66లక్షల80 వేలు మంజూరు చేసింది. భారీ వర్షాల కారణంగా 2023 జూలై 27న అర్ధరాత్రి మారేడుగొండ చెరువు తెగింది. వరద ప్రవాహానికి ఆరుబయట నిద్రిస్తున్న ముగ్గురు గల్లంతైన సంఘటన తెలిసిందే. మొదటిసారి చెరువు మరమ్మతుల కోసం ఐబీ అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించగా ఎలాంటి స్పందన రాలేదు. రెండోసారి 2023 డిసెంబరులో రూ.4కోట్ల32 లక్షలతో అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి నిధుల విడుదలకు మోక్షం లభించలేదు. చెరువు ఆయకట్టు కింద 1563 ఎకరాలకు నీరు అందకుండా పోతోందనే ఆవేదన రైతుల్లో వ్యక్తమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి సీతక్క చొరవతో నిధులు మంజూరయ్యాయి. రూ.3కోట్ల66లక్షల80వేలు విడుదల చేస్తున్నట్లు ఐబీ అధికారులకు గురువారం లేఖ అందింది. చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ములుగుకు నర్సింగ్ కళాశాల

- 50సీట్ల కేటాయింపు
- ఈఏడాది నుంచే తరగతులు

ములుగు, సెప్టెంబరు 12: ములుగు జిల్లాకు నర్సింగ్ బోధన కళాశాల మంజూరైంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయగా తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చర్యలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 15 కళాశాలలు మంజూరుకాగా ములుగుకు ఒకటి కేటాయించారు. ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుబంధంగా పనిచేసే నర్సింగ్ కాలేజీకి తొలి ఏడాది 50 సీట్లను కేటాయించారు. ఎంసెట్ ర్యాంకులు ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరిస్తూ కౌన్సెలింగ్, అడ్మిషన్ ప్రక్రియ కొనసాగనుంది. నవంబరు మొదటి వారంలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. కళాశాల, హాస్టళ్ల కోసం 15వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనం అవసరం. సొంత భవనం నిర్మాణమయ్యేంత వరకు ప్రస్తుతం నిర్మాణం చివరి దశలో ఉన్న జిల్లా ఆస్పత్రిలోని బ్లాక్-సీని కేటాయించే అవకాశాలున్నట్లు ములుగు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ బానోతు మోహన్‌లాల్ తెలిపారు. కళాశాల నిర్వహణ కోసం ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది నియామకం జరుగుతుందని వెల్లడించారు. ఇదిలా ఉంటే వైద్యకళాశాలలో నవంబరు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యిందన్నారు.

ములుగులోని ఏరియా వైద్యశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు కోసం 2009 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆస్పత్రికి నూతన భవనం నిర్మించిన సమయంలోనే నర్సింగ్ కళాశాల కోసం అప్పటి ఎంపీ పోరిక బలరాంనాయక్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించగా మంత్రులు అనుకూల ప్రకటనలు కూడా చేశారు. ఎట్టకేలకు జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కావడంతో నర్సింగ్ కళాశాల ఏర్పాటు అనివార్యమైంది. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

కిటకిటలాడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు

కాటారం, సెప్టెంబరు 12:మండలంలోని పలు గ్రామాల్లో డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. జ్వరపీడితులతో ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పలు గ్రామాల పరిధిలో పలువురు టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో మంచం పట్టారు. రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలు జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని, మండలవ్యాప్తంగా ఫీవర్ సర్వే చేపట్టి వైద్య శిబిరాలు నిర్వహించి జ్వర పీడితులకు చికిత్స అందించాలని కోరుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

రైళ్ల హాల్టింగ్ పొడిగింపు

శాతవాహన, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ ఆరు ఆరునెలలు

గిర్మాజీపేట, సెప్టెంబరు 12: ప్రస్తుతం చర్లపల్లి, మహబూబాబాద్, జమ్మికుంట, మంచిర్యాల రైల్వేస్టేషన్‌లలో కొనసాగుతున్న కొన్ని రైళ్ల తాత్కాలిక హాల్టింగ్‌లను ప్రయాణికుల సౌకర్యార్థం మరో ఆరునెలలు పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా విజయవాడ-సికింద్రాబాద్ శాతాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సిరిపూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీలు చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం నుంచి యథావిధిగా మరో ఆరునెలల పాటు ఆగుతాయని తెలిపారు.

అలాగే మహబూబాబాద్‌లో నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, జమ్మికుంటలో సికింద్రాబాద్-ధానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి, మంచిర్యాలలో పుణే-కాజీపేట వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 20 నుంచి యథావిధిగా మరో ఆరునెలలు ఆగుతాయని పేర్కొంది.

మక్కలు క్వింటా రూ.3,090

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 12: వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో గురువారం మొక్కజొన్నలకు మరింత ధర పెరిగింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమారేడిల్లి గ్రామానికి చెందిన పెండ్లి తిరుపతి 66బస్తాల మక్కలు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకురాగ సదా ట్రేడర్స్ నిర్వాహకుడు సదానందం క్వింటా రూ.3,090 చొప్పున కొనుగోలు చేశారు. వారం రోజుల క్రితం క్వింటా రూ.3,070 పలుకగా మార్కెట్ చరిత్రలో అదే రికార్డు ధరగా నిలిచింది. తాజాగా మరో రూ.20 అదనంగా పెరగడం విశేషం.



మార్కెట్లో మక్కలు అమ్మిన రైతు తిరుపతి

మహిళపై అత్యాచారయత్నం

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 12: ఓ మహిళపై యువకుడు ఒకడు అత్యాచారానికి యత్నించాడు. ఈ సంఘటన మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతికేళ్ల యువకుడు ఒకరు గ్రామంలో జులాయిగా తిరుగుతున్నాడు. బుధవారం రాత్రి అదే గ్రామంలో ఒంటరిగా నిద్రిస్తున్న 55 ఏళ్ల మహిళపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. దీంతో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిరోసిన్ స్టౌవ్ పేలి వృద్ధురాలికి గాయాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 12: కిరోసిన్ స్టౌవ్ పేలి వృద్ధురాలికి గాయాలైన సంఘటన భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం చోటుచేసుకుంది. సాబిర్ అనే వ్యక్తి అంబేద్కర్ కూడలిలో తోపుడు బండిపై స్వీట్ కార్న్ విక్రయిస్తుంటాడు. పక్కనే భూపాలపల్లి పట్టణ పరిధి ఖాశీంపల్లికి చెందిన జోరు లచ్చమ్మ కంకులు కాల్చి అమ్ముతోంది. స్వీట్ కార్న్ ఉడకబెట్టేందుకు సాబిర్ కిరోసిన్ స్టౌవ్‌ను వినియోగిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా స్టౌవ్ పేలిపోయి మంటలు చెలరేగాయి. లచ్చమ్మ రెండు కాళ్లకు అంటుకోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 12: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి హనుమకొండకు బయల్దేరిన బస్సు అంబేద్కర్ సెంటర్‌లో రెడ్ సిగ్నల్ పడటంతో ఆగింది. ఆ వెంటనే గ్రీన్ సిగ్నల్ పడగా ముందున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఆ ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళ కిందపడిపోగా స్వల్ప గాయమైంది.

పిచ్చి కుక్కల స్వైర విహారం

13 మందికి తీవ్ర గాయాలు

చిట్యాల, సెప్టెంబరు 12: మండల కేంద్రంతో పాటు తిర్మలపురం, ముచినిపర్తి గ్రామాల్లో గురువారం సాయంత్రం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. 13 మందిని తీవ్రంగా గాయపర్చాయి. పలు పశువులపై దాడి చేశాయి. మండల కేంద్రానికి చెందిన మాసు రాజేశ్వరి, పుల్ల సదయ్య, కె.రమేష్, లిఖిత, పి.అనూష, ర్యాకం ఆదిరెడ్డి, గుండ లత, ఎస్.రక్షిత, జన్నె సునీత, కవితతోపాటు మరో ఇద్దరిని, పదుల సంఖ్యలో పశువులు, దూడలను గాయపర్చాయి. గాయపడిన వారిని స్థానికులు చిట్యాల పీహెచ్‌సీకి తరలించారు. వీరిలో ఏడుగురిని అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి జిల్లా ఆస్పత్రికి పంపారు. చిట్యాలలో తొమ్మిది మందిని కరిచిన పిచ్చి కుక్కను గ్రామస్థులు కర్రలతో కరిచి చంపేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 12: గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొర్రెకుంట ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పేకాట శిబిరంపై దాడి చేశారు. 10 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి రూ.20 వేల నగదు, ఐదు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న 10మందిలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం గీసుగొండ పోలీసులకు అప్పగించారు. ఆరుగురు పరారయ్యారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

నేడు నిట్‌లో ఫార్మా ఏఐ సదస్సు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12: కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పేరుతో ఫార్మా ఏఐ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సులో సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి.ప్రదీప్ ప్రారంభోపన్యాసం ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండలో ఫార్మారంగం భవిష్యత్తును చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6డీ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ తాళ్లూరి, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.శ్రీకాంత్, డిప్యూటీ డైరెక్టర్ జి.రాంధన్, డాక్టర్ రెడ్డీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి తదితరులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధితో పాటు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.సత్యశారద తదితరులు పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సు సాయంత్రం 4.30 గంటల వరకు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

దళితులను బహిష్కరించడం దుర్మార్గం

వడ్డెపల్లి, సెప్టెంబరు 12: మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం గోతోజీగూడెం గ్రామంలో డప్పు కొట్టలేదని దళితుడు పంచమి శంకరయ్యతోపాటు కుటుంబ సభ్యులను గ్రామ బహిష్కరణ చేయడం దుర్మార్గమని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్దన్ మాదిగ అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఎంహెచ్‌డీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకరయ్య చిన్న కుమారుడు జేఎన్‌టీయూలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కారణంగానే కక్ష కట్టి అగ్రవర్ణ ఆధిపత్య భావజాలం కలిగిన గ్రామ పెద్దలు గ్రామ బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీ, ఎమ్మెల్యే, ఎంపీలు శంకరయ్య కుటుంబానికి అండగా నిలవాలని ఎలుకటి జనార్దన్ మాదిగ కోరారు. ఎంహెచ్‌డీ రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్, రాజేష్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

వర్సిటీ భూముల్లో నివాసితులకు చుక్కెదురు

- హైకోర్టు మెట్లెక్కిన 9 మంది కాలనీవాసులు
- స్టేకు నిరాకరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12 : కాకతీయ యూనివర్సిటీ సర్వే నెంబరు 229లో నివాసముంటున్న 9మందితో పాటు మరికొందరు రాష్ట్ర హైకోర్టు మెట్లెక్కారు. కొన్నేళ్లుగా సర్వే నెంబర్ 229లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న నేపథ్యంలో వర్సిటీ అధ్యాపకుల సంఘం, వర్సిటీ విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర విద్యాశాఖాధికారులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నేతృత్వంలో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ప్రత్యేక సర్వే చేపట్టింది. వర్సిటీలోని అన్ని సర్వే నెంబర్లలో సర్వే చేపట్టి భూ కబ్జాలను తేల్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా రెండురోజులుగా వర్సిటీలోని బీసీ కాలనీలో అధికారులు సర్వే చేపట్టారు. సర్వేలో బీసీకాలనీకి చెందిన భవనాలు, అంతర్గత ప్రధాన రహదారి సైతం వర్సిటీ భూముల్లోనే ఉందని రూఢీ అయింది. దీంతో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జాల్లోకి వచ్చిన వారిపై చట్టరీత్యా చర్యలకు ఉపక్రమించారు.

హైకోర్టులో..

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సర్వేలతో వర్సిటీ భూముల వివరాలన్నీ పక్కాగా లెక్కలు తేల్చేపనిలో ఉండగా, 229 సర్వే నెంబర్‌తో పాటు గుండ్లసింగారం, కుమార్‌పల్లి సర్వేనెంబర్ల పరిధిలోని తొమ్మిది మంది గతంలో రాష్ట్ర హైకోర్టు తలుపులు తట్టారు. గతంలో వేసిన పిటిషన్ సెప్టెంబరు 12న గురువారం విచారణకు వచ్చింది. వర్సిటీ భూకబ్జాదారులు తరుపున న్యాయవాది స్టే ఇవ్వాలని కోరడంతో హైకోర్టు స్టేకు నిరాకరించింది. మునిసిపల్ అధికారులు నోటీసు ఇచ్చారని, కూల్చివేతలకు పాల్పడే అవకాశం ఉందని కోర్టుకు తెలుపడంతో కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే మునిసిపల్ అధికారులు తదుపరి చర్యలు తీసుకునే ముందు భూకబ్జా, అక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిచ్చిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు చట్టానికి అనుగుణంగా ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని హైకోర్టు అభిప్రాయాన్ని వెల్లడించింది. కాగా, కోర్టు మెట్లెక్కిన వర్సిటీ కాలనీలకు హైకోర్టు తాజాతీర్పులో ఊరట లభించకపోవడంతో వర్సిటీ భూముల చెర వీడనుంది. వర్సిటీ భూముల కబ్జాలకు పాల్పడిన వారిలో ఆందోళన మొదలైంది. కబ్జాలు తెలిన తక్షణమే కూల్చివేతలు చేపడుతామని ఇప్పటికే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. కాగా, హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందని హైకోర్టుకు వెళ్లిన బాధితులు చెబుతున్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

మడికొండ, సెప్టెంబరు 12: మరణానంతరం నేత్ర దానంతో ఇద్దరు అంధులకు కంటిచూపు చేకూరుతుందని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన బిల్ల ధర్మారెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి డాక్టర్ లక్ష్మణ్ ద్వారా నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుటు శ్రీరాములు అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి బానోత్ గణేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ బేస్‌బాల్ పోటీల్లో గణేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా గణేష్ రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మందుల పద్మ, ఉపాధ్యాయులు రవి, రవికుమార్, ప్రేమ్‌కుమార్, ఉమారాణి, కృష్ణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీలత పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల డబ్బులపై విచారణ జరపాలి

- కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌గౌడ్



మాట్లాడుతున్న పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12: కేయూ ఎస్ఎఫ్‌సీ కోర్సులకు చెందిన రూ. 40 కోట్లు అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో వెంటనే విచారణ జరపాలని కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని క్యాంటీన్ ఎదుట ఏర్పాటు చేసిన పార్టుటైం అధ్యాపకుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోల్తి కిరణ్ గౌడ్ హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లోని వీసీ, రిజిస్ట్రార్‌లు రూ.40కోట్లు దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఐదేళ్లకోసారి ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేయాలనే నిబంధనలున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 15ఏళ్లు దాటినా ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు చేపట్టిన ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ డబ్బులన్నీ తిరిగి ఆయా కోర్సులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేయూ పార్టుటైం అసోషియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, సలహాదారులు కృష్ణ సుమంత్, శ్యాంసుందర్‌చారి, రజనీకాంత్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలే దని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ చైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్ వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్ల నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "దర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రిసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

మీటర్లు లేకుంటే 'గృహజ్యోతి' వర్తించదు

ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు

కాటారం, సెప్టెంబరు 12: విద్యుత్ మీటర్లు లేకుంటే 'గృహజ్యోతి' వర్తించదని ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ మీటర్ల ఏర్పాటు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏడీఈ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా రాబోయే ప్రజాపాలన గ్రామసభల్లో నూతన మీటర్ల నెంబర్లతో దరఖాస్తులు చేసుకుంటే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మేఘనాథ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, లైన్‌మెన్లు ప్రవీణ్, బాలాజీ, శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ పస్తం సారయ్య, విద్యుత్ సిబ్బంది శంకర్, మహేష్, చందు తదితరులు ఉన్నారు.

రూ. 938కు కరెంటు మీటర్

వెంకటాపూర్(రామప్ప): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇల్లులేనివారు, కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారు విద్యుత్ మీటర్ పొందాలని అంటున్నారు సంబంధిత శాఖ అధికారులు. ఇప్పటి వరకు విద్యుత్ మీటర్లులేని వారు 500 వాట్స్ రూ.938 ధరకు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యుత్‌మీటర్లు లేనివారు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈనెల 15వతేదీ వరకు విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో తిరిగి మీటర్ లేని పేదవారిని గుర్తిస్తామని, దీంతో తక్కువ ధరకు మీటర్ అందిస్తామని, ప్రజాపాలనలో గృహజ్యోతి ద్వారా విద్యుత్ సబ్సిడీ పొందొచ్చని అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటో, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు దరఖాస్తుఫారంతో కలిసి అందించాలని పేర్కొంటున్నారు.

'మహిళాశక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 12: మండలంలోని మహిళా సంఘాల సభ్యులు మహిళాశక్తి కార్యక్రమాలైన పాడిగేదెలు, ఆవులు, పెరటికోళ్ల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం రవి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వెలుగు మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారి మంజుల అధ్యక్షతన గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో హుస్సేన్, డీపీఎంలు నారాయణ, రవి, ఏపీఎం అంబాల రవి, పశువైద్యాధికారి రాకేష్, ఏపీవో హలీమ్, ఆకినపల్లి ఏపీజీవీబీ బీఎం అనిల్, సీసీలు బాబూరావు, శ్రీనివాస్, ప్రవీణ్, వీవోఏలు, మహిళాశక్తి లబ్ధిదారులు పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో చోరీ

టేకుమట్ల, సెప్టెంబరు 12: మండలంలోని వెల్లంపల్లిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బుచ్చి రాజిరెడ్డి ఇంట్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బుచ్చిరాజిరెడ్డి బుధవారం ఉదయం పనినిమిత్తం పరకాల పట్టణానికి వెళ్లగా ఆమె భార్య వ్యవసాయ పనులకు వెళ్లినట్లు తెలిపారు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటితాళం పగలగొట్టి 2 తులాల బంగారం, 50 వేల నగదు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు బుచ్చిరాజిరెడ్డి ఫర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై అన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సీతక్క



టేకులగూడెంలో ఎదుమయ్య భార్యకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, సెప్టెంబరు 12: మండలంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కర్లపల్లి గ్రామశివారు టేకులగూడెం గ్రామానికి చెందిన మడవి ఎదుమయ్య పిడుగుపడి మృతిచెందగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క గురువారం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేశారు. అనంతరం ఫ్రూట్‌ఫారం గ్రామంలో రూ.కోటి86లక్షల నిధులతో నిర్మించిన బీటీరోడ్డు, పాతనాగారం నుంచి నేతాజీనగర్ వరకు రూ.66లక్షలతో నిర్మించిన బీటీరోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ, తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్టుల వినతి

ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ మండలంలోని జర్నలిస్టులు గురువారం మంత్రి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు మోడెం సారంగపాణి మాట్లాడుతూ మండలంలో జర్నలిస్టులు 25ఏళ్లకుపైబడి పనిచేస్తున్నారని, వారికి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ద్వారా ఎలాంటి సహకారం అందక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికే కొందరు ఆర్థిక, అనారోగ్య కారణాలతో మృతి చెందారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు అంకం వినయ్‌కుమార్, కార్యదర్శి సామ బుచ్చిరెడ్డి, కోశాధికారి బత్తిని వెంకట్, జర్నలిస్టులు పగడాల సుబ్బారెడ్డి, జన్నారపు రమేష్, నర్రా రఘువీర్, వేముల సతీష్, గుండెబోయిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

మేడారం : గత నెల 31న పిడుగుపడి మృతి చెందిన పశువుల కాపరి పుట్ట మహేష్ కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. ఎంపీ పోరిక బలరాం నాయక్, కలెక్టర్ దివాకరలతో వెళ్లి కలిశారు. ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అలాగే కాల్వపల్లి గ్రామంలో వరదలో చిక్కుకుని మృతి చెందిన జెర్రిపోతుల మల్లికార్జున్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5లక్షల చెక్కులు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మహిళా జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వరావు, గ్రామ అధ్యక్షుడు మొక్క శ్రీను, నాయకులు థామస్‌రెడ్డి, లచ్చుపటేల్, ఎనగంటి రాములు, తాండాల శ్రీను, రాపోలు సంజీవరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కార్యకర్తలు సంజయ్, దుర్గయ్య, సమ్మయ్య, నరేష్, శోభన్, నర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 12: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. వసతి గృహాల్లో మరమ్మతు, ప్రాథమిక, కమ్యూనిటీ ఆస్పత్రుల నిర్మాణ ప్రగతి పనులపై సంబంధిత అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాలు 55 ఉన్నాయని, వాటి మరమ్మతుకు సోమవారం వరకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఉప ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్‌లో సీటీ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అధికారులు ఆర్‌వో ప్లాంట్లను తనిఖీ చేసి వాటి మరమ్మతులు చేపట్టలన్నారు. నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ఆర్‌వో ప్లాంట్లపై ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రహరీల ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్, పీఆర్‌ఈఈ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

డీఎంహెచ్‌వో మధుసూదన్

రేగొండ, సెప్టెంబరు 12: వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మండలంలోని రూపిరెడ్డిపల్లిలో మండల వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డ్రైడేలో భాగంగా చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డా చందన, సీహెచ్‌వో లింగారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి



రవి (ఫైల్)

రేగొండ, సెప్టెంబరు 12: బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నారాయణపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి (బీ)కి చెందిన మేరుగు రవి(35) బైక్ పై రేగొండ నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో పరకాల-భూపాలపల్లి రహదారిపై నారాయణపూర్ గ్రామం వద్ద ప్రమాదం జరిగిది. భూపాల పల్లి నుంచి పరకాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రవికి తీవ్ర గాయాలు కాగా పర కాలలోని ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమ ధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య మనీషా, కుమారుడు, కూతురు ఉన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 12: పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలు నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం అనిల్, గోనెల చంద్రయ్య, మహిళా కార్యదర్శిగా రాధికలు ఎన్నికయ్యారు. అనంతరం పదోన్నతి, బదిలీ అయిన ప్రణీత, సదానందంను సన్మానించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిలి విజయ పాల్‌రెడ్డి, నాయకులు సాదిక్, కృష్టారెడ్డి, సాంబయ్య, బండి శ్రీను, హకీం, హరిప్రసాద్, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ధర్నా

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలిక కుటుంబసభ్యులు

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 12: బాలిక మృతికి వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ బాలిక కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాల్ఫిన్ పిల్లల ఆస్పత్రి ఎదుట గురువారం ఆందోళన చేశారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేటకు చెందిన జన్నె రాజు-ఉమ దంపతుల కుమార్తె సాయిశ్రీ డెంగీతో బాధపడుతుండగా ఈ నెల 9న డాల్ఫిన్ పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. తమ బిడ్డ ప్రాణాలను కాపాడుకోవడానికి అక్కడిక్కడ తిప్పలు పడి ఆస్పత్రి యాజమాన్యానికి రూ.2.50 లక్షలు చెల్లించారు. అయితే ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి బాలిక ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని చెబుతూనే ఐసీయూలో ఉంచి ఆరోగ్యంపై సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచారు. గురువారం ఉదయం ఐసీయూలో ఉన్న బాలికను చూడటానికి వెళ్లిన తండ్రికి కూతురు విగతజీవిగా కనిపించడంతో కంగుతిన్నాడు. ఆ సమయంలో ఐసీయూలో ఒక్క డాక్టర్ కూడా లేడు. కేవలం వైద్యుల సహాయకులతో బాలికకు సీపీఆర్ చేసే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే బాలిక మృతిచెందింది. దీంతో బాలిక కుటుంబసభ్యులు తమ పాప మృతికి వైద్యులు, యాజమా న్యం కారణమంటూ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందో ళన నిర్వహించారు. వారికి మద్దతుగా డీవైఎఫ్ఐ, ఏబీవీ ఎఫ్, స్వేరోస్, బీసీ సంఘాలు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం ప్రైవేటు ఆస్పత్రులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఆరేళ్ల పాప మృతికి కారణమైన డాల్ఫిన్ ఆస్పత్రిపై విచారణ చేపట్టి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా, బాలిక ఆరోగ్యం విషమించడంతో మృతి చెందిందని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది. విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఈ విషయంపై హనుమకొండ సీఐ సతీష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

భర్త ఇంటి ఎదుట బైఠాయించిన భార్య

న్యాయం కావాలని వేడుకోలు

శాయంపేట, సెప్టెంబరు 12: తనకు న్యాయం చేయాలని ఓ భార్య తన భర్త ఇంటి ఎదుట బైఠాయించి ధర్నాకు దిగింది. బాధితుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన బండి ప్రతాప్-జయ దంపతుల కూతురు పావనికి, హన్మకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన అయిలి కుమారస్వామి-రమ దంపతుల కుమారుడు రాకేష్‌తో 2021 సంవత్సరంలో రూ.20 లక్షలు కట్నం ఇచ్చి, పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. 6 నెలల తరువాత రాకేష్ కుటుంబం అదనపు కట్నం కోసం వేధింపులు, కుటుంబ కలహాలు మొదలయ్యాయి. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు సముదాయించినా ఫలితం లేదు. దీంతో ఇద్దరు విడిపోవడానికి నిర్ణయించుకుని ఇందుకు భర్త రాకేష్, భార్య పావనికి రూ.15లక్షలు చెల్లించే విధంగా తీర్మానం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 8 నెలలు గడిచినా తమకు డబ్బులు ఇవ్వడంలేదని, ఈ విషయంలో పెద్దమనుషులు సైతం చేతులెత్తేశారని బాధితులు వాపోయారు. దీంతో న్యాయం కావాలని పావని గురువారం రాకేష్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. ప్రస్తుతం రాకేష్ కుటుంబంతో సహా హనుమకొండలో ఉంటున్నారు. తమకు న్యాయం జరిగేవరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకుని కూర్చున్నారు. ఈ మేరకు పావనికి పలువురు మద్దతు తెలిపారు.

గణేష్ మండపాల వద్ద మహా అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 12: భూపాలపల్లి పట్టణంలోని పలు గణపతి మండపాల వద్ద అన్నదానం చేశారు. సుభాష్‌కాలనీలో వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, కోఆప్షన్ సభ్యుడు బేతోజే వజ్రమణి, టీటీ చారి, కమిటీ సభ్యులు బ్రహ్మారెడ్డి, వెంకటిరెడ్డి, సమ్మయ్య, బాలరాజు, హీరాలాల్, శ్రీనివాస్‌రెడ్డి, శివ, నరసింహాచారి, భూమయ్య, రామస్వామి పాల్గొన్నారు.

- చిట్యాల : మండల కేంద్రంలోని పలు గణపతి మండపాల వద్ద అన్నదానం చేశారు. బుర్ర రమ-మొండయ్య దంపతులు, పాంద్రాల నీల-వీరస్వామి దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు పిట్టల నాగరాజు, అనిల్, అంజిత్, ర్యాకం రాజేందర్, శ్రావణ్, రంజిత్, మణికుమార్, వేణు, శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప) : మండలకేంద్రంలో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత ఎనబోతుల రఘు, యూత్ సభ్యుడు బీరెడ్డి భీమన్న, మునిగాల ప్రశాంత్, మంద వేణు, ఉడుత కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.
- మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద భక్త మండళ్లు అన్నదానం చేశాయి. భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పూజారులు, నాయకులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. కమలాపురానికి చెందిన ముస్లిం సయ్యద్ వహీద్ దంపతులు రూ.1,500 నగదును మండపం వద్ద అన్నదానం కోసం విరాళంగా అందజేశారు.
- కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గణనాథుల మండపాల వద్ద భక్తులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, వెంకటస్వామి, ప్రభాకర్, సతీష్, శ్రీనివాస్, రాజబాపు, దేవేందర్, కుల సంఘాల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 12: మండలంలో గణపతి నిమజ్జన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన గణపతికి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆరో రోజు నిమజ్జనం చేశారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పాత్రాపురం పంచాయతీలోని పాలెంవాగులో నిమజ్జనం చేశారు.

గురుకుల విద్యాలయంలో..

కాటారం : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో నెలకొల్పిన గణపతి విగ్రహ నిమజ్జనోత్సవం గురువారం ఘనంగా జరిగింది. విగ్రహాన్ని ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేయడానికి కాళేశ్వరం తరలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పెద్దపులి సంచారంపై వదంతులు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు12 : మండలంలో పెద్దపులి సంచారంపై వదంతులు వైరల్ అవుతోంది. రోడ్డు పక్కన కనిపించిందని ఒకరు, పొలంలో పడుకుందని మరొకరు ఇలా మూడు రోజులుగా ఈ వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. మండలంలోని జీడివాగు సమీపంలో పెద్దపులి రోడ్డు పక్కన పెద్దపులి ఉందని ఈ నెల 9న ఓ లారీ డ్రైవర్ చెప్పడంతో కలకలం రేగింది. తీరా ఆ లారీ డ్రైవర్‌ను ఫారెస్టు అధికారులు ఆపి పులి కనబడిన ప్రదేశానికి తీసుకెళ్లి చూశారు. అది రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన పెద్దపులి సైన్‌బోర్డుగా గుర్తించారు. తర్వాత తన పొలంలో పెద్దపులి కనిపించిందంటూ గురువారం ఉదయం మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన ఓ రైతు సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశాడు. అది కూడా వైరల్ అయ్యింది. ఈ విషయం ఫారెస్టు అధికారులకు తెలుపగా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ రహ్మాన్ తన బృందంతో రైతుతో కలిసి అక్కడికి వెళ్లి చూశారు. పొలంలో పడుకున్నది పులి కాదని, అది కుక్క అని గుర్తించారు. పులి సంచారిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుండడంతో మండలంలోని ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారు. పులి సంచారంపై వస్తున్నవి వదంతులు మాత్రమేనని ఫారెస్టు రేంజ్ అధికారి రహ్మాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో పులి సంచారిస్తున్నట్లు ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్

తాడ్వాయి, సెప్టెంబరు 12: జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం మండలంలోని వెంగళాపూర్, నార్లాపూర్, మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కామారం, ఇందిరానగర్, తాడ్వాయి, బయ్యక్కపేట ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 బాధిత ఉపాధ్యాయుల కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినా సమస్య పరిష్కారంలో జాప్యం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, మెడికల్, సరెండర్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, ఎస్టీయూ మండల అధ్యక్షుడు కందిక రాజు, ప్రధాన కార్యదర్శి జన్ను శ్యాంసన్, సభ్యులు బత్తుల సతీష్, బిళ్ల శ్రవంత్, సుజాత, సమ్మయ్య, రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు రామప్పలో వేలం

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 12: మండలంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏడాది పాటు లడ్డూ, పులిహోర విక్రయం, కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు ఈనెల 13న ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో బిల్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు రూ.లక్ష, కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు రూ.20వేల ధరావత్ సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 12: మండలంలోని కొండాపురం, నాయకులగూడెం, బోదాపురం, పాత్రాపురం, శివాపురం గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్నేహ ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరాల్లో వైద్యాధికారులు ఆశిష్, వినయ్, సోహెల్, పవన్, సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, రాఘవులు, రాజేష్, రాంబాబు, మోహన్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు శాతాన్ని పెంచాలి

బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



కాటాపూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నాయకులు

తాడ్వాయి, సెప్టెంబరు 12: మండలంలోని ప్రతి బూత్ నుంచి సభ్యత్వ నమోదు శాతాన్ని పెంచాలని బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని కాటాపూర్ గ్రామంలో డ్యాగల సలేందర్ అధ్యక్షతన గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జంగ హన్మంతరెడ్డి, తాళ్లపల్లి లక్ష్మణ్, చెంగల సుభాష్, గడ్డం వెంకటేశ్వర్లు, ఎస్ సురేందర్, పోరిక వెంకట్రాం, తుపాకుల సదానందం, ఓడ రంజిత్, ఈసం వెంకటేష్, ఆళ్ల నవీన్, కొత్తపల్లి కుమార్, పల్లెర్ల అరుణ్, చెవుగాని రఘు తదితరులు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం : గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని ఆ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి రుద్రారపు సురేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నరేష్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు పల్ల బచ్చయ్య, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గండేపల్లి సత్యం, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

మంగపేట, సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. రోగులు భారీ సంఖ్యలో రావడంతో ఇద్దరు వైద్యులతో కలిసి డీఎంహెచ్‌వో రోగులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాటాడారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఇక నుంచి రెగ్యులర్‌గా వైద్యులు ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి రోగులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 12 : స్వయం ఉపాధితో మహిళలు స్వావలంబన సాధించాలని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మగ్గం, ఎంబ్రాయిడరీ వర్క్ శిక్షణ గురువారం ముగిసింది. శిక్షణ పొందిన 70 మంది మహిళలకు మగ్గాలు పంపిణీ చేశారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ బ్యాగుల శిక్షణకు ఆసక్తి గల మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పీ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చు సతీష్, కోశాధికారి వెంకట్రావు, సహాయ కార్యదర్శి గంజి రమేష్, కమిటీ సభ్యులు, ట్రైనర్లు రజిత, సృజన తదితరులు పాల్గొన్నారు.

షాపులు తొలగించాలి : ఎమ్మార్పీఎస్

ఏటూరునాగారం, సెప్టెంబరు 12 : మండల కేంద్రంలోని రుద్రమదేవి మార్కెట్ సమీపంలో ఉన్న షాపుల యజమానులు రోడ్డును ఆక్రమించి పండ్లు, కూరగాయలు అమ్ముతున్నారని, వాటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడిదల సతీష్ కోరారు. గురువారం ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, కార్యదర్శి రమాదేవికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. రోడ్లను ఆక్రమించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వావిలాల స్వామి, పరికి మహేష్, కిషోర్, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

20న ఐటీడీఏలో పాత వాహనాల వేలం

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు12: ఈ నెల 20న ఐటీడీఏలో వాహనాలు, ఇతర వస్తువులను వేలం వేయనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 25వేలను ప్రాజెక్ట్ అధికారి ఐటీడీఏ ఏటూరునాగారం పేరు మీద డీడీ తీయాలని సూచించారు. వేలానికి సంబంధించిన ఫారం ఐటీడీఏ కార్యాలయంలో రూ. వెయ్యి చెల్లించాలని తెలిపారు. అదేవిధంగా దరఖాస్తు ఫారానికి డీడీని జతచేసి 18వ తేదీలోపు ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో బొలెరో, లేలాండ్ వాహనాలు, కమాండర్, అశోక్ మహీంద్ర జీపులు, అలమార్లు, జనరేటర్, ఇనుప గేట్, సీపీయూ, ప్రింటర్లు, పాత కుర్చీలు, పాత పంపు మోటార్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఐరన్ పైపులు, ఇతర సామానులను వేలం వేయనున్నట్లు పీవో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9676363101 నంబర్లను సంప్రదించాలని పీవో సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కాటారం, సెప్టెంబరు 12: మండలంలోని గంగారం, దామెరకుంట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలు, డీసీఎంఎస్ సెంటర్లను వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శ్రీపాల్ గురువారం తనిఖీ చేశారు. ఏవో పూర్ణిమతో కలిసి ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల స్టాక్, అమ్మకాల రికార్డులు, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఏఈవో రాజన్న ఉన్నారు.

నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి : డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, సెప్టెంబరు 12:మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి గురువారం సందర్శించారు. మండపాల వద్ద నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండపాల వద్ద కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఐలు నాగార్జునరావు, రాంచందర్‌రావు, ఎస్సైలు అభినవ్, పవన్ తమాషారెడ్డి, నరేష్, మహేందర్ తదితరులు ఉన్నారు.